క్లుప్తంగా

చెత్త సేకరణ విధానం పరిశీలన



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ప్రజారోగ్య అధికారి సాంబమూర్తి

విజయనగరం: నగరంలోని వివిధ ప్రాంతాలలో ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి శనివారం పర్యటించి పారిశుధ్య విధానాలను పర్యవేక్షించారు. నగరపాలక సంస్థలో రోజువారీ విధుల్లో భాగంగా ఎనిమిదో సర్కిల్‌లో పర్యటించి, ఇంటింటి చెత్త సేకరణ విధానాన్ని గమనించారు. ఆరుబయట చెత్త వేసిన దుకాణ యజమానులను మందలించారు. అలాగే 8వ సర్కిల్ మస్టర్ ఆఫీస్ వద్ద సంబంధిత పర్యావరణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలువల్లో దోమల నివారణకు మందు పిచికారీ చేయాలని సూచించారు. క్లాప్ యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు.

పారిశుధ్యం అధ్వానం



మొయిద జంక్షన్ బ్రిడ్జి వద్ద రోడ్డుపైకి చేరిన చెత్త

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి మొయిద జంక్షన్ సమీపంలోని బ్రిడ్జివద్ద పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. విజయనగరం-పాలకొండ మెయిన్‌రోడ్డులో గల ఈ ప్రాంతం వద్ద పాలిథిన్ వ్యర్థాలు, చెత్త పేరుకుపోవడంతో ప్రయాణికులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నిత్యం ఈ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని కోరుతున్నారు.

బహుమతుల అందజేత



బహుమతులు అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం కృష్ణ, తదితరులు

డెంకాడ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు శనివారం నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. వ్యాసరచన పోటీల్లో ఎం. వాగ్దేవి, మహంతి జ్యోత్స్న... వక్తృత్వంలో జ్యోత్స్న, యామిని... చిత్రలేఖనంలో ఎం. దేవేంద్ర, బి. భావన విజేతలుగా నిలిచారు. హెచ్‌ఎం కృష్ణ, లైబ్రేరియన్ వై. మహేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

పక్కాగా కులగణన..



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

నెల్లిమర్ల: కులగణన పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ జి. రామారావు, తహసీల్దార్ డి. ధర్మరాజు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కులగణనపై వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని 16 సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి కులగణన పక్కాగా చేయాలని సూచించారు. అలాగే ప్రతి ఇంటిలో ఏయే కులాల వారు ఉన్నారో పరిశీలించి నమోదు చేయాలన్నారు. అంతేకాకుండా వారికి కులాల వారీగా అందుతున్న పథకాలను తెలుసుకోవాలని సూచించారు అలాగే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, పీడీలు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..



శంకరరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న చౌడువాడ గ్రామస్తులు

పూసపాటిరేగ: మండల కేంద్రానికి చెందిన శంకరరావు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో అతని కుటుంబ సభ్యులకు చౌడువాడ గ్రామస్తులు శనివారం రూ. 40 వేల ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ముంగం నాగబాబు, పసుపులేటి శ్రీనివాసరావు, ముంగం మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె నోటీస్

విజయనగరం ఫోర్ట్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిసెంబర్ 8వ తేదీన సమ్మె చేపట్టనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు ఉమామహేశ్వరి, హైదిరాజు తెలిపారు. ఈమేరకు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి బి. శాంతకుమారిని శనివారం కలిసి సమ్మె నోటీస్ అందజేశారు.

దిబ్బేశ్వరాలయానికి వెయ్యేళ్ల చరిత్ర

- కోరిన కోర్కెలు తీర్చే శివయ్య
- కార్తీకమాసంలో పోటెత్తనున్న భక్తులు



పూర్తి రాతి కట్టడంతో ఉన్న దిబ్బేశ్వరాలయం

నెల్లిమర్ల రూరల్: జిల్లాలోనే అత్యంత పురాతనమైన ఆలయంగా దిబ్బేశ్వరాలయం ప్రసిద్ధి పొందింది. విజయనగరం నుంచి నెల్లిమర్ల వెళ్లే రహదారిలో సారిపల్లి సమీపంలో పారిశ్రామికాభివృద్ధి ప్రాంతాన్ని ఆనుకుని ఈ ఆలయం ఉంది. చంపావతి నది ఒడ్డున ప్రశాంతమైన వాతావరణంలో వెలసిన ఈ ఆలయానికి వెయ్యి సంవత్సరాల పైనే చరిత్ర ఉంది. ప్రస్తుతం పురావస్తు శాఖ ఆధీనంలో ఉన్న ఈ ఆలయానికి ఏటా వేలాదిమంది తరలివస్తారు. కోరిన కోరికలు తీర్చే దైవంగా ఇక్కడ దేవుడిని భావిస్తారు. శివుడికి మరో రూపమైన దిబ్బేశ్వర స్వామిని పూజిస్తే కష్టాలు తొలగిపోతాయనేది భక్తుల నమ్మకం. ఆలయం లోపల శివ లింగంతో పాటు పార్వతీదేవి విగ్రహం, నందీశ్వరుడి విగ్రహాలున్నాయి.

పురాతన జైన దేవాలయం..

దిబ్బేశ్వరాలయాన్ని జైనులు నిర్మించినట్లు పురావస్తు శాఖ గుర్తించింది. 11వ శతాబ్దంలో ఈ అలయ నిర్మాణం జరిగినట్లు చరిత్ర చెబుతోంది. అప్పట్లో జైనులు దీన్ని నిర్మించారని పురావస్తుశాఖ చెబుతుండగా స్థానికులు మాత్రం స్వయంగా దేవతలే ఆలయాన్ని నిర్మించారని నమ్ముతారు. గతంలో జన సంచారం అసలు ఉండేది కాదని... సారిపల్లి గ్రామస్తులే ఈ అడవి గుండా నడిచి వెళ్లేవారని చెబుతారు. అప్పటిలో ప్రతిరోజూ అర్ధరాత్రి దేవతలు స్వయంగా ఈ ప్రాంతానికి వచ్చి ఆలయాన్ని నిర్మించేవారని భక్తుల నమ్మకం. వేకువజామున ప్రజల అలికిడికి దేవతలు వెళ్లిపోయేవారని.. అర్ధరాత్రి వేళ ఆలయంలో భజనలు చేస్తున్న శబ్దాలు వినబడేవని తమ పెద్దలు చెప్పేవారని గ్రామస్తులు చెబుతున్నారు.

పూర్తిగా రాతి నిర్మాణమే..

ఆలయం పూర్తిగా రాతితో నిర్మించారు. నిర్మాణంలో ఎక్కడా సున్నం గాని, సిమెంట్ గాని ఉపయోగించలేదు. రాళ్లపై శిల్పాలు చెక్కి ఒక దానిపై ఒకటి పేర్చి నిర్మించారు. ఆలయం నిర్మించి వెయ్యేళ్లయినా ఏ మాత్రం చెక్కుచెదరలేదు.

కార్తీకమాసంలో సందడే సందడి..

కార్తీకమాసంలో ఈ ఆలయానికి వేలాది మంది భక్తులు తరలివస్తారు. ప్రతి సోమవారం స్వామివారిని పూజించడం కోసం బారులు తీరుతారు. వన సమరాధనకు అనువైన ప్రదేశం కావడంతో ఈ మాసమంతా సందర్శకులతో కళకళలాడుతుంది. అలాగే శివరాత్రి రోజున స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు తండోపతండాలుగా ఈ ఆలయానికి చేరుకుంటారు. విజయనగరం, నెల్లిమర్ల, గుర్ల, తదితర ప్రాంతాల నుంచి పిక్నిక్‌ల కోసం వస్తుంటారు. ఆలయం పక్కనే చంపావతి నది ఉండడంతో సందడి వాతావరణం నెలకొంటుంది. ఈ ఆలయాన్ని ఇప్పుడిప్పుడే పురావస్తుశాఖ అభివృద్ధి చేస్తోంది..

గడప వద్దకే సంక్షేమ పాలన...



రెడ్డికంచేరులో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: రాష్ట్రంలో జగనన్న నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల గడప వద్దకే సంక్షేమ పాలన అందిస్తోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రెడ్డికంచేరు పంచాయతీ పరిధి పిన్నింటిపాలెం, గాబువానిపేట, రెడ్డికంచేరులో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ బైరెడ్డి రమణ, శీరపు గురునాథ్‌రెడ్డి, తదితరులతో కలసి శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు నాలుగున్నరేళ్ల కాలంలో ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని తెలియజేస్తూ ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. కుల,మత,రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో పడాల భానుప్రకాష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, డీబీ రెడ్డి, తహసీల్దార్ చింతా బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పూర్తిస్థాయిలో పౌష్టికాహారం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేసలి అప్పారావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: బాలల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనత తలెత్తకుండా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పూర్తిస్థాయిలో అందించాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. బాలల హక్కుల గురించి బాలలకు, సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. శనివారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ, బెజ్జిపురం యూత్ క్లబ్, కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం, బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలలు తమ బాల్యాన్ని అనుభవిస్తూనే నచ్చిన రంగంలో ఎదగాలని సూచించారు. ఆడపిల్లల చదువు తల్లిదండ్రులకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఉన్నత విద్య వరకు అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాల ద్వారా నగదు చెల్లిస్తోందని తెలిపారు. అంగన్‌వాడీ నుంచి హైస్కూల్ వరకు పాఠశాలలో పౌష్టికాహారం అందిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణంలో పిల్లలకు చదువు అందించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నందున 18 ఏళ్లు నిండే వరకు బాలికలను చదివించాలని, ఆ తర్వాతే వివాహం చేయాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాల్య వివాహాలపై హెల్ప్‌లైన్‌కు నెలకు నాలుగైదు కాల్స్ వస్తున్నాయని చెప్పారు. బాల్య వివాహాల పట్ల కఠిన వైఖరి ప్రదర్శించాలన్నారు. బాలలు స్వేచ్ఛగా చదువుకుని వారికి నచ్చే రంగంలో ఎదగడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు మాట్లాడుతూ, బాలల హక్కుల ఉల్లంఘన జరిగితే చర్యలు తప్పవన్నారు. టీనేజర్లు చెడు స్నేహాలు చేయవద్దన్నారు. వీలైనంతవరకు సెల్‌ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని చెప్పారు. అనంతరం బెజ్జిపురం యూత్‌క్లబ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వారు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు, మెమెంటోలు అందజేశారు. జాతీయ స్థాయి స్కేటింగ్‌లో మొదటి బహుమతి సాధించిన బొల్లెంకుల లోహిత్‌రెడ్డి, తైక్వాండోలో ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన ఇషిత, నేషనల్ సూపర్ కిడ్ అవార్డు పొందిన నితీష్, శ్రేష్ట బాలిక అవార్డు పొందిన దివ్యాంగురాలు శ్రేయ మిత్ర, యునిసెఫ్ అంబాసిడర్, సఖిగ్రూప్ కార్యకర్త పెదమజ్జి సౌభాగ్య, యూఎస్‌ఓలో ఏపీ ఎడ్యుకేషన్‌పై ప్రసంగించిన అల్లం రిశిత రెడ్డి, నేషనల్ కామన్వెల్త్‌లో గోల్డ్ మెడల్ సాధించిన బెల్లాన హారికలను ఘనంగా సత్కరించి మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ సాధికారిత అధికారి బి. శాంతకుమారి, జిల్లా బాలల సంక్షేమ కమిటి చైర్మన్ హిమబిందు, జిల్లా బాలల సంరక్షణ అధికారి యాళ్ల నాగరాజు, పీఓఐసీ రామకోటి పాల్గొన్నారు.

ఇందుకూరి పాదయాత్రకు ఎమ్మెల్సీ సంఘీభావం



ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో కలిసి అడుగులు వేస్తున్న ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల రూరల్: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రానికి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఈ నెల 8 నుంచి శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి జయహో జగనన్న పాదయాత్ర పేరిట ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తిరుపతి పాదయాత్ర ప్రారంభించిన సంగతి తెలిసిందే. రఘురాజు పాదయాత్రం శనివారం నాటికి ప్రత్తిపాడు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. ఏలేశ్వరం మండలం ధర్మవరం సమీపంలో ఇందుకూరి రఘురాజును ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు కలిసి సంఘీబావం తెలిపారు. మంచి సంకల్పంతో చేపట్టిన తిరుపతి పాదయాత్ర దిగ్విజయంగా కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయనతో పాటు సుమారు 4 కిలోమీటర్లు నడిచారు.

భారత్‌కు మద్దతు తెలుపుదాం..

- జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు



మాట్లాడుతున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు

విజయనగరం: పన్నెండేళ్ల తర్వాత భారత జట్టు ప్రపంచ క్రికెట్ టోర్నీలో ఫైనల్‌కు చేరుకున్నందున ప్రజలందరూ మద్దతు తెలియజేయాలని విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు తెలిపారు. ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ సమీపంలోని ఎగ్జిబిషన్ మైదానంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం జరిగే ప్రపంచ కప్ ఫైనల్ పోటీ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్ సమీపంలో ఉన్న మైదానంలో భారీ ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రజలతో పాటు సమీప గ్రామాల ప్రజలు, క్రికెట్ అభిమానులు పాల్గొని భారత జట్టుకు మద్దతు తెలపాలని కోరారు. క్రికెట్ మ్యాచ్ వీక్షణకు ఎటువంటి ప్రవేశ రుసుం లేదన్నారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెలెక్టర్ వర్మ, కోచ్ సురేందర్, రమేష్, చంద్రశేఖర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సక్రమంగా రికార్డులు నిర్వహించాలి..



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈఓ విజయ్‌కుమార్

నెల్లిమర్ల: ప్రైవేట్ పాఠశాలల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంఈఓ -2 ఈపు విజయ్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ, మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలలను శనివారం సందర్శించి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాజరు పట్టికకు, ఆన్‌లైన్ నమోదుకు తేడాలు ఉండకూడదన్నారు. అదేవిధంగా ఆన్‌లైన్‌లో ఉన్న విద్యార్థుల సంఖ్య, ప్రస్తుత హాజరుపట్టికలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు సమానంగా ఉండాలని తెలిపారు. చదవని వారికి ధ్రువపత్రాలు జారీచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యమల్లె పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో అభ్యుదయ రచయితల సంఘం, యువ స్పందన సంయుక్త ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పుస్తకావిష్కరణ జరిగింది. కొంకెపూడి అనురాధా రచించిన హిందీ అనువాద కథల పుస్తకం జంగ్లీ మోంగారా (నిత్యమల్లె) పుస్తకాన్ని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జీఆర్ రవీంద్రనాథ్ ఆవిష్కరించారు. పుస్తకాన్ని విశ్రాంత ప్రదానోపాధ్యాయుడు పీవీఎల్.సుబ్బారావు సమీక్ష చేశారు. అదేవిధంగా డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు రచించిన దీర్ఘ కావ్యం దగ్ధగోళం పుస్తకాన్ని రేపల్లి ఈశ్వరరావు సమీక్ష చేశారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షుడు జీఎస్ చలం, ప్రధాన కార్యదర్శి రత్నాల బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన దీక్ష రేపు



రామతీర్థం జంక్షన్ వద్ద నిరసన వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న మున్సిపల్ కార్మికులు

నెల్లిమర్ల: మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విజయనగరం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) నెల్లిమర్ల నగర పంచాయతీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి బాబూరావు తెలిపారు. ఈ మేరకు రామతీర్థం జంక్షన్ వద్ద కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే కార్మికులను రెగ్యులర్ చేయకపోగా, ఆప్కోస్‌లో చేర్చి శాశ్వత బానిసలుగా మార్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఇచ్చిన మాట ప్రకారం రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో దుర్గారావు, శ్రీను, హరి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరుకున్న నిరాహార దీక్ష



దీక్షలో పాల్గొన్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రామ్మోహన్ మాట్లాడుతూ, జిల్లాలో పేరుకుపోయిన విద్యారంగ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, అయితే ఇప్పటివరకు ఎటువంటి హామీ ఇవ్వలేదన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ నిరాహార దీక్షలకు పూనుకుందని చెప్పారు. ఈ క్రమంలో ఈ నెల 21న చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు రవికుమార్, రమేష్, సమీర, రమేష్, భారతి, డేవిడ్ పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేయాలి

విజయనగరం అర్బన్: ఆర్టీసీలో అక్రమ సస్పెన్షన్‌లను రద్దు చేయాలని ఎస్ఎంయూఏ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఎస్ఎంయూఏ కార్మికులపై యాజమాన్యం పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఇటీవల ఒక మహిళా కండక్టర్‌ను అన్యాయంగా సస్పెండ్ చేశారన్నారు. చిన్న, చిన్న విషయాలకు కూడా సస్పెండ్ చేస్తున్న డిపో మేనేజర్ వైఖరి మారాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు పీజీ రాఫెల్, డిపో కార్యదర్శి కె.చంద్రమౌళి, అధ్యక్షుడు వి.రామారావు, జీవీఎం శ్రీనివాస్, సరిత, బీఎల్‌వీ కుమారి, పీవీటీ రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక జాతీయ విద్యా విభాగం కన్వీనర్ రాజశేఖర్

విజయనగరం అర్బన్: ఉత్తమ ఫలితాలు సాధించాలంటే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ విద్యా విభాగం కన్వీనర్ డాక్టర్ ఎ.వి రాజశేఖర్ అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'చదవడంలో మెలకువలు' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే మార్కులు ఒక్కటే కొలమానం కాదన్నారు. ప్రతిభతోనే ఏదైనా సాధించగలమని చెప్పారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్, పట్టణ కమిటీ అధ్యక్షుడు షణ్ముఖరావు, జిల్లా కమిటీ స భ్యులు చిరంజీవి, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

450 మంది దివ్యాంగులకు ఉపకరణాలు



మాట్లాడుతున్న నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం అర్బన్: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా యంత్రాంగం శనివారం స్థానిక యూత్ హాస్టల్‌లో చేపట్టిన సహాయ ఉపకరణాలకు అర్హుల ఎంపిక ప్రక్రియకు విశేష స్పందన లభించింది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం గుర్తించిన ప్రముఖ కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం (ఆలిమ్ కో) తయారుచేసిన దివ్యాంగుల ఉపకరణాలను విశాఖకు చెందిన ఐఓసీఎల్ సంస్థ సేవా నిధులతో ఉచితంగా పంపిణీ చేయడానికి అర్హుల ఎంపిక ప్రక్రియను చేపట్టామని ఆ శాఖ జిల్లా ఎ.డి జీవీబీ జగదీష్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన దివ్యాంగుల్లో 450 మందిని ఉపకరణాలకు ఎంపిక చేశామన్నారు. వారికి దాదాపు రూ.11 లక్షల విలువ చేసే మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, చంక కర్రలు, కృత్రిమ కాళ్లు, కాలిపర్లు, రోలేటర్స్, చెవి మెషీన్లు (బీటీఈ), వాకింగ్ స్టిక్స్, తదితర ఉపకరణాలు అందజేస్తామన్నారు. విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.

రేషన్ వాహనాలపై ప్రధాని ఫొటో ఉండాలి

విజయనగరం టౌన్: ప్రజలకు ఉచిత బియ్యం ఇస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో ప్రతి రేషన్ వ్యాన్‌పై ఉండాల్సిందేనని భారతీయ జనతా పార్టీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు పిల్లా నవీన్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మన్నె శ్యామ్, రాంబాబు, మజ్జి రామారావు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: మండలంలోని రెడ్డికంచేరు, కొండరాజుపాలెం గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.80 లక్షలు విలువగల చెక్కులను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు బాధితులకు శనివారం అందజేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు చేసుకున్న బోయి నందినికి రూ.1.80 లక్షలు, సూర్ని నరసయ్యమ్మకు లక్ష విలువగల చెక్కులు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పొందని వారు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. చెక్కులు అందుకున్న బాధితులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భాను, శీరపు గురునాథ్‌రెడ్డి, సర్పంచ్ బైరెడ్డి రమణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కొయ్య లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా ఓటరు నమోదు

భోగాపురం: ఓటరు నమోదు కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని నియోజకవర్గ ఈఆర్ఓ నూకరాజు సూచించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బీఎల్ఓలతో ఓటర్ల నమోదుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఒకే వ్యక్తికి రెండు ఓట్లు లేకుండా చూడాలని.. చిరునామాలో మార్పులు, చేర్పులుంటే చేయాలని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ బంగార్రాజు, డీటీ శ్రీనివాస్, బీఎల్ఓలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీతం కళాశాలలో ఫ్రెషర్స్ డే



విద్యార్థులను అభినందిస్తున్న జేఎన్‌టీయూ జీవీ వీసీ ప్రొఫెసర్ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ఆరంభ్' పేరుతో శనివారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, విద్యార్థులు ఎంచుకున్న కోర్సులను ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం జాతీయ స్థాయి శిబిరాలకు హాజరైన ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు, వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అధ్యాపకులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. అనంతరం ముఖ్య అతిథిని కళాశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.